కథా నిలయం
5595
శ్రీకాకుళం

# నాంది

చెంపలమీదుగా కారుతున్న కన్నీళ్ళు మాళవిక గుండెలమీద పడి చిలకపచ్చ కంచిపట్టు చీరను తడిపేసినై. కళ్ళకాటుక కన్నీళ్ళకు కరిగిపోయి చీరమీద నల్లని మచ్చలుగా తయారైంది. పమిటకొంగు తీసి కళ్ళు తుడుచుకుంటుంటే రెండు చేతుల నిండుగావున్న బంగారు గాజులు తళతళా మెరుస్తూ, తనని చూసి వెక్కిరిస్తున్నట్టున్నయ్. దిట్టంగా కొబ్బరితాడుతో పేనినట్టున్న బంగారుగొలుసు, రూపాయి కాసంత పుస్తెలూ మెడచుట్టూ, చేనుకి కంచెలాగా గొంతుకి కాపలాగా వున్నట్టనిపించింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుండడంతో, గట్టిగా అరవాలనిపించింది. తనివితీరా ఏడవాలనిపించింది. ఏదీ చెయ్యలేక పిచ్చిదానిలా సోఫాలో కూలబడిపోయింది మాళవిక.

శ్రీనాథ్ ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. ఉమామహేశ్వరి మనవడినీ, మనవరాలిని తీసుకుని గుడికెళ్ళింది. ఎవరో స్వాములవారు అక్కడ హరికథ చెబుతున్నారని. అందుకే అంత ఖాళీ సమయం దొరికినందుకు, తనివితీరా, గుండె బరువు తీరిపోయేలా గట్టిగా ఏడవాలనిపించింది స్వేచ్ఛగా!

అశోక్‌నగర్‌లో అది మూడంతస్తులు గల కాంప్లెక్స్! ఒక్కొక్క ఫ్లోర్‌లో నాలుగిళ్ళ చొప్పున పన్నెండు కాపురాలుంటున్నాయి. రెండో ఫ్లోర్‌లో పన్నెండో నెంబరు ఇంట్లో వుంటున్నారు మాళవికావాళ్ళు. ఆ కాంప్లెక్స్ పక్కనే అన్నీ గుడిసెలు. ఉన్నట్టుండి ఆ గుడిసెల దగ్గరనుంచి పెద్దపెద్ద కేకలు వినిపిస్తే మాళవిక కళ్ళు తుడుచుకుని, ఏం జరిగిందా అని కంగారుగా బాల్కనీలో కొన్ని గుడిసెల వైపు తొంగిచూసింది.

'ఏందే ఆ పని! మొగుడు కోపంతో నాలుగు తంతే, గిట్ల జాకెట్టిప్పి సిగ్గులేకుంట ఊరంత జూపిస్తున్నావ్! నడువ్ లోపటికి! సిగ్గులేదే నీకు? నా కడుపున సెడబుట్టినవ్..... పుట్టంగనే వాంతులు జరమొచ్చింది. అప్పుడు సచ్చినా పీడబోతుండే...! మొగోడు... ఏదో రెండు దెబ్బలెయ్యంగనె ఉర్కొస్తవ్! తల్లిగారిల్లు దగ్గరుండ పట్కెనేగద.... అరిచింది ఆమె. ఆమె మాటలను బట్టి, ఆమె ఏడుస్తున్న ఆ మనిషికి తల్లి అయివుంటుందనుకుంది మాళవిక!

'నువ్వు తల్లివేనా నాకు? అసలు మడిసివేనా? దున్నపోతును కొట్టినట్టు ఆడు ముల్లుగర్ర తీస్కొని కొడుతూంటే, అడ్డురాకపోతివి, ఆణ్ణి ఆపకపోతివి' అరుస్తూనే గట్టిగా ఏడ్చింది ఆమె రక్తాన్ని చెంగుతో తుడుచుకుంటూ.

'ఏందే ఆపేది? మొగుడన్నంక కొడ్తడు. తిడ్తడు గట్లబయటపడాలంటే, గిట్ల సంసారాలు సేత్తుమామేము?' మందలించింది తల్లి.

'ఇగో పోచీ! గిట్ల లొల్లిజేసి బజార్నపడితే, మేము దీస్కపోయి ఇంట్ల బెట్టుకుంటమనుకుంటున్నవేమో! నువ్వు సచ్చినా గాపని సెయ్యి! ఆడదంటే అత్తగారింట్ల కొట్టినా తిట్టినా పడుండాల. ఇదే పని ఇయ్యాల నువ్వు జేసినట్టు మీ ఒదిన జేసుంటే, దాని పానం దీస్తుంటి ఇయ్యాల ఎర్కనా? ఆ!.....'' అంటూ అరిచాడు ఒక యువకుడు. మాటలనుబట్టి అతడు ఆమెకు అన్న అయ్యుంటా డనుకుంది మాళవిక. మాళవికకు చెమటలు పడ్తున్నయ్! గుండె వేగంగా కొట్టు కుంటున్నట్టనిపించింది. కాళ్ళు లాగుతూన్నా, ఏం జరుగుతుందోనన్న కుతూహలంతో అలా బాల్కనీలోనే వాళ్ళను చూస్తూ వుండిపోయింది.

'నేను మీ ఇంటికొచ్చి మీ ఇంట్ల పడుంటనని యాడ 'మళ్ళబోన'ని అంటనోనని, నన్ను రాకుంట మాట్లాడుతున్నారు మీరు. మీకు ప్రేమలేదా? పెండ్లిజేసి పంపంగనే మీ బాధ్యతంత అయిపోయినట్టేనా? అట్లయితే ఇనుండ్రి. సస్తే ఇంకేడికన్నబోయి సస్తగానీ, మీ ఇంట్లనయితే కాలుబెట్ట. పోశమ్మ తల్లిమీద ఒట్టుపెట్టి సెప్తున్న!..... అమ్మనాయన పక్కనుంటే, అన్న ఒదిన ఆదుకుంటే ఆడికి బుద్దొస్తది... నాయం జెప్పి నిలబెడ్తరనుకున్నగానీ, గిసుంటి మాటలని, నన్ను ఇంకా సంపుతరనుకోలేదు' వెక్కివెక్కి ఏడ్చింది ఆమె!

'ఏందే సంసారంల గుట్టుండాల్నే! కొట్టుకున్నా తిట్టుకున్నా కాలు బయటపెట్టొద్దు. ఇయ్యాల నువ్వు రోడ్డునబడి కట్టుకున్నోడి పరువుదీసినవ్. కన్నోల్ల పరువు దీసినవ్! మాకు నలుగుర్ల మొఖం లేకుంట జేసినవ్! ధూ... ' అంటూ చివరి దమ్ము లాగి బీడీని అవతల పారేసి, పక్కనున్న గట్టుమీద కూర్చుని మాట్లాడుతూన్న ముసలాయనని చూసి, 'ఏడుస్తున్నామె తండ్రి కాబోలు' అనుకుంది మాళవిక.

మాళవిక ఆలోచనలు చిక్కుపడ్డ దారాల్లా గజిబిజిగా అయిపోయాయి. 'పరువు' అనేది అదివరకటినుంచి ఒక్క మధ్యతరగతి కుటుంబీకులకే వుండేది. పరువు, 'ప్రతిష్ఠ', 'సంప్రదాయం', 'ఆచారం' అనే ముసుగులలో, ఎన్ని లొసుగులున్నా, వాటివల్ల తమకు అన్యాయం జరుగుతోందని తెలిసినా ఆ వలయాల నుంచి బయటపడలేక, వలలో చిక్కుకున్న చేపపిల్లల్లా విలవిల్లాడిపోతారు. ఆత్మార్పణ చేసుకుంటారే తప్ప, మధ్యతరగతి వాళ్ళు ఆ వల్లయాలను ఛేదించి బయటపడలేకపోతున్నారు. పరువు, మర్యాద - వీటిని అతిక్రమించమనీ, అనుసరించవద్దనీ ఎవ్వరూ చెప్పరు. ఒక క్రమపద్ధతిలో, క్రమశిక్షణతో

సమాజం నడవాలంటే, కొన్ని నియమాలూ నిబంధనలూ అవసరమే. కాని మానవత్వపు విలువల ముందు ఈ నియమాలూ నిబంధనలూ ఎక్కువా? మనం ఎండ రాపిడికీ గాలి తాకిడికీ దెబ్బతినకుండా అడ్డుగా నిలిచి మనని కాపాడతాయని మనం పెట్టుకున్న అడ్డుగోడలూ, ఆంక్షలూ, మన ప్రాణాలను కాపాడలేకపోతే, అవి అవసరమా? ఆలోచిస్తోంది మాళవిక! ఈ జాడ్యం ఇప్పుడు అందరికీ అంటుకుంది అంటువ్యాధిలా!

ఆమె కళ్ళు కిందకి చూశాయి. ఆమె ఏడుస్తున్నదల్లా ఆపి కళ్ళు తుడుచుకుంది. వీపు మీద వున్న రక్తాన్ని చీర కొంగుతో తుడుచుకుంది. లోపల్నుంచి ఒక నడివయస్కుడు బనీనూ లుంగీతో బయటికొచ్చాడు. 'లోపలకు నడు' అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టుగా. అందరూ దూరం జరిగారు. 'బహుశా ఆమె భర్త అయివుంటాడ' నుకుంది మాళవిక.

నేను రాను' మొండిగా అంది ఆమె.

'పోయే! ... నడువ్ లోపలికి' అరిచాడు అన్న.

'నేను బోను'

'ఈడనే కూకోని సస్తవా?'

'ఆ... సస్త'

'సావు! బెదిరిస్తున్నవా? సస్త.. సస్త అని' ఉరిమింది తల్లి. 'మనని బుగులుబెట్టాలని గట్లంటుంది గాని, నిజంగ సస్తదా? నడువ్! మనం బోదాం' అంటూ పెళ్ళానికి చెప్పి లోపలికి నడిచాడు తండ్రి. అతని వెనకాలే ఆమె వెళ్ళిపోయింది. అన్నా వొదినలు కూడా వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళగానే ఒక్కొక్కళ్ళూ మెల్లగా వెళ్ళిపోయారు!

ఆమె వెక్కివెక్కి ఏడుస్తూ అలానే నుంచుంది. 'పదవే... నీ' ...' అంటూ జుట్టుపట్టి లాగి ఒక్కతోపు తోశాడు బలంగా అతడు. 'ఓరి దేవుడో!'...' అంటూ ఆమె ఏడ్చిన ఏడుపు కొన్ని నిమిషాలు వినిపించి ఆగిపోయింది. అతడూ లోపలికెళ్ళిపోయాడు.

మాళవిక మనసు అతలాకుతలమైపోయింది. ఆలోచనలు కందిరీగల్లా ముసురుకున్నాయి. 'ఆమెని ఇంకా కొడుతున్నాడేమో అతడు. కన్నవారే పరువుకోసం కాదు పొమ్మంటే భర్తకింకా చులకన కాదూ? చావు దెబ్బలు తింటూ కాపురం ఎలా చేస్తుంది? ఆడదానికి మనసు లేదా? దెబ్బలు తినకుండా బతికే యోగ్యత లేదా? భర్త అనే వ్యక్తి ఎన్ని హింసలు పెట్టినా పడుండవలసిందేనా? సమాజం అడ్డుకోదా? చివరకి కన్నతల్లి కూడా అలా

దెబ్బలు తింటూ పడుండమనే ధర్మాన్నే బోధించింది. పైగా తనూ అలాగే బతికింది కదా అని ఉదహరించింది. అంటే చావు దెబ్బలు తింటూనే, గుట్టుగా కాపురం చేస్తూ బతకాలి ఆడది! ఏం న్యాయం? ఆడది... అదే భార్య భర్తని కొడితే? అది వార్త అవుతుంది! కానీ భర్త భార్యని కొట్టినా, చంపినా అది న్యాయమే - అతని హక్కు అవుతుంది. ఎంత చక్కటి రూలు! మాళవిక నిట్టూర్చింది. ఈ అస్తవ్యస్తాలను తలుచుకుంటే భరించలేని బాధ సెగలైపొగలై ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలనుంచి రగులుతూ బయటికొస్తోంది.

మాళవిక ఆలోచనలు మళ్ళీ రెక్కలు విప్పుకున్నై. బాగా డబ్బున్న వాళ్ళ మధ్య ఈ భార్యాభర్తల సంబంధాలు వేరుగా వుంటాయి. ధైర్యంగా విడాకులిచ్చుకుంటారు. లేదా, ఒకరినొకరు పట్టించుకోకుండా సమాంతర రేఖల్లా సాగిపోతూ వుంటారు. కింది వర్గాలలో కోర్టులూ వ్యవహారాలూ లేకుండా, రచ్చబండ దగ్గర పంచాయితీ పెట్టి, తప్పొప్పులు విచారించి, ఎవరి ఖర్చులు వాళ్ళకిప్పించేసి, విడిపోయి హాయిగా మళ్ళీ వాళ్ళ ఇష్టం వచ్చినట్టు బతకడానికి అవకాశం కల్పిస్తారు. కానీ అటు ఇటూ కానిదే మధ్యతరగతి మనుగడ. కర్ర విరగకూడదు. పాము చావకూడదు. వాళ్ళు చస్తూ బతికినా ఫరవాలేదు. సంప్రదాయాలూ, పరువు ప్రతిష్ఠలూ చావకూడదు. ఈ రోగం అనవసరంగా ఇప్పుడు కింది వర్గాల వారికీ అంటుకుంది మహమ్మారిలా! అదే నాగరికత అనుకుంటున్నారు.'' ఆలోచిస్తున్న మాళవిక ఉరుములాంటి అత్తగారి కేక - 'అక్కడేం చేస్తున్నావే?' అంటూ అరిచిన అరుపుకి ఈ లోకంలోకొచ్చి 'వస్తున్నానత్తయ్యా!' అంటూ లోపలికి నడిచింది.

'కాసిన్ని మంచినీళ్ళిచ్చి తగలడు' అంది ఉమామహేశ్వరీదేవి ఉరిమి చూస్తూ.

మాళవిక ఫ్రిజ్ తెరిచి మంచినీళ్ళు తీసి గ్లాసులో పోసి ఇచ్చింది. 'స్నేహా!... గౌరవ్! ...మీకు అన్నం పెట్టనా?' అడిగింది మాళవిక.

'వద్దు... బామ్మే పెట్టాలి' అన్నారు ఇద్దరూ.

'అమ్మో! అంత పని చెయ్యకు. ఏదో మహా ప్రేమ మండిపోతూన్నట్టు ఏక్టింగ్ చెయ్యకు. సవతితల్లి ప్రేమిస్తుందన్నా తాటిచెట్టు నీడనిస్తుందన్నా ఎవ్వరూ నమ్మరు.' అంది ఉమామహేశ్వరీదేవి మంచినీళ్ళ గ్లాసుని అందిస్తూ.

ఎప్పుడూ ఇవే మాటలూ, దెప్పుళ్ళూ వినీవినీ విసిగిపోయిన మాళవికకి ఆ క్షణంలో సహనం నశించింది.

'నా ప్రేమ మీదా నా మాటమీదా నమ్మకం లేనివాళ్ళు నన్నెందుకు తెచ్చుకున్నారు కోడలిగా?' అడిగింది.

'ఎందుకా! నా వొంట్లో ఓపిక తగ్గిపోయింది. వంటావార్పూ నావల్ల కావడం లేదు. అందుకని'.

మాళవిక ఇటువంటి మాటలు అదివరకు ఎన్నోసార్లు విన్నా, ఆ రోజున మాత్రం ఒక్కమాట కూడా భరించలేని స్థితిలో వుంది. అందుకే ఎదురు సమాధానం చెప్పింది. 'అదే కారణమయితే, రాత్రింబగళ్ళు పడుండే వంటమనిషినో పనిమనిషినో పెట్టుకోవలసింది. పెళ్ళంటూ నా గొంతు ఎందుక్కోశారు?' అడిగింది మాటలన్నీ కూడగట్టుకుని ఎలాగో ధైర్యం తెచ్చుకుని.

'ఏమిటే వాగుతున్నావ్? పూటకి గతి లేక కట్నాలిచ్చి పెళ్ళి చేయలేక నీ అబ్బ ముగ్గురు కూతుళ్ళనీ ఇంట్లో పెట్టుకునుంటే, జాలిపడి, దమ్మిడీ కట్నం లేకుండా నిన్ను ఈ ఇంటికి కోడల్ని చేసుకుని ఒంటెడు బంగారం పెట్టి, బంగారంలా చూసుకుంటూ వుంటే, ఎంత పొగరెక్కిందే నీకు? నాకే సమాధానం చెప్తావా?' అరిచింది ఉరుములా ఉమామహేశ్వరీదేవి.

సరిగ్గా అదే సమయానికి ఇంట్లోకొచ్చాడు శ్రీనాథ్.

మాళవిక తనతల్లితో ఏదో ఘర్షణ పడుతోందని అనుకుని కారణం అడక్కుండానే విషయమేమిటో తెలుసుకోకుండానే ఛెళ్ళున చెంపమీద కొట్టాడు.

మాళవికకి కళ్ళు గిర్రున తిరిగాయి. గుండ్లనిండా నీరు నిండి చెంపలను తడిపేశాయి! మాళవిక అక్కడనుంచి వెళ్ళిపోయింది.

అదివరకు ఎన్నిసార్లో ఇలాంటి మాటలుపడ్డా, ఎన్నో దెబ్బలుతిన్నా, ఏదోలే అని సర్దుకుపోయింది. కానీ, ఈరోజు ఆ దెబ్బ చెంపకికాక గుండెకి తాకినట్టయింది. మనసు మాటల తూటాలకి చిల్లులు పడినట్టయింది. ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళి మంచంమీద కూర్చుని వెక్కివెక్కి ఏడ్చింది.

ఉన్నట్టుండి పెద్ద కోలాహలం ఆ వాడవాడనంతా చుట్టేసింది! తగలబడిపోతూన్న గుడిసెమీద బిందెలతో నీళ్ళు కుమ్మరిస్తున్నారు. మంటల పొగలు నల్లని మేఘాల్లా ఆ రోడ్డంతా కమ్ముకున్నాయి. క్షణంలో భర్త దెబ్బలకు తట్టుకోలేక రాములమ్మ కిరసనాయిల్ పోసుకుని తగలబెట్టుకుందట. అక్కడికక్కడే చచ్చిపోయిందిట' అన్న వార్త పాక్కిపోయింది ఆ వీధి వీధంతా!

మాళవిక పిచ్చిదానిలా అయిపోయింది. భర్త హింసలు చెప్పుకోవడానికీ, కాస్త ఊరట కలిగించి నీడనివ్వడానికీ కన్నవాళ్ళే కాదు పొమ్మన్నారు. మొగుడి నొదిలేసిన ఆడదానిగా మా ఇంటికొచ్చి మా పరువు తీయొద్దన్నారు. ఇంకెక్కడికి పోతుంది ఆమె? తన చితిని తనే పేర్చుకుని, ఎవరి పిలుపుకీ అందనంత దూరాలకి వెళ్ళిపోయింది రాములమ్మ.

హాల్లో ఉమామహేశ్వరీదేవి, శ్రీనాథ్‌లు మెల్లగా గుసగుసల్లాగా మాట్లాడుకుంటున్న మాటలు వినబడి, వినకూడదనుకుంటూనే వింది మాళవిక!

'ఒరేయ్! నువ్వు దాన్ని హింసించకు. నువ్వు కొట్టిన దెబ్బలకీ, సిగరెట్టు వాతలకీ ఇది తగలబెట్టుకు చచ్చిందంటే కోర్టు చుట్టు తిరగలేక మనం ఛస్తాం'అంది ఉమామహేశ్వరీదేవి. 'దానిబొంద! దానికి చచ్చేంత ధైర్యం కూడా వుందా? అదలాగే పడుంటుందిలే! పుట్టింట్లో పెళ్ళి కావలసిన ఇంకా ఇద్దరు చెల్లెళ్ళున్నారు కనక, దీన్ని రానివ్వరక్కడికి! చచ్చినట్టు పడుంటుంది' అన్నాడు శ్రీనాథ్.

' ఈ గొడవలొస్తాయనే నేను నీ భార్య చెల్లెలు వసుంధరనే చేసుకొమ్మన్నాను. ఏదో బావగారే కదా అక్క పిల్లలే కదా అని పడుంటుందని చెప్తే నువ్వు విన్లేదు. 'నేను సునీతని మర్చిపోలేను' అంటూ ఏదో నా కోసం చేసుకున్నట్టుగా ఎవతో ఒకతిలే అని దీన్ని చేసుకున్నావ్. ఒరేయ్! అలా సిగరెట్టు పీకలతో వాతలెందుకు పెడుతున్నావురా? రేప్పొద్దున అది ఏమైనా చేస్తే?' భయంగా అంది ఉమా మహేశ్వరి. 'అమ్మా! మాళవికలో ఏదో పొగరు, నిర్లక్ష్యం నాకు కనిపిస్తోందమ్మా... దాని పెద్దపెద్ద కళ్ళు చూసి దానికి పొగరని నాకనిపిస్తోంది. అందుకే అది నా దగ్గరికొస్తే నన్నేదో అది చిన్నచూపు చూస్తున్నట్టు నా కనిపిస్తుంది. అందుకే సిగరెట్టు పీకలతో కాలుస్తున్నాను. బాధతో అది కళ్ళు మూసుకుంటుంది నన్ను చూడకుండా' అన్నాడు శ్రీనాథ్.

మాళవిక మరి వినలేకపోయింది. భార్యా రూపవతీ శత్రుః అన్నదానికి నలుగురూ నానారకాల అర్థాలు చెప్పారు. కానీ, ఈ అర్థం ఇప్పుడే తెలుసుకున్నాను. నా అందం నాకే శత్రువవుతోందా? అందాన్ని ఆరాధించేవాళ్ళూ, అభిమానించేవాళ్ళూ కోకొల్లలు. కానీ, ఇలాంటి దిక్కుమాలిన వాళ్ళూ వుంటారా?' మాళవిక రక్తం ఉడికిపోయింది. మరొకటి మరొకటి అయితే సర్దుకుపోవచ్చు. కానీ ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి? రాములమ్మలా చావాలా? లేకపోతే ఇలా శ్రీనాథ్ చేతుల్లో చస్తూ బతకాలా?' పిచ్చిదానిలా అయిపోయింది మాళవిక.

* * *

ఆ రాత్రి ఆమెకి నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూ ఝాము రాత్రిదాకా గడిపింది! తెల్లవారు ఝామున మెరుపులాంటి ఆలోచన మెదడులో వెలిగింది! వెంటనే లేచి చప్పుడు చెయ్యకుండా వెళ్ళి సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుంది. పుట్టింటివాళ్ళు ఇచ్చిన జత గాజులూ, మంగళసూత్రం గొలుసు తప్ప అన్నీ తీసేసి బీరువాలో పెట్టి, మెల్లగా తలుపుతీసి, బయటపడింది. 'ఇంకా పూర్తిగా తెలవారలేదు. తనని ఎవరూ చూడలేదు' అని నిర్ధారణ చేసుకుని, ఆటో ఎక్కింది. తిన్నగా మహిళా కోర్టు జడ్జి మాధవిగారింటికి బయలుదేరింది. ఆమెతో తన గోడునంతా వెళ్ళబోసుకుంది. ఒంటిమీద వున్న సిగరెట్టు వాతలు చూపించి, డైవోర్స్ కోరింది. అంతవరకూ తనకి రక్షణ కల్పించమని తన స్నేహితురాలు శైలజకి ఫోను చేసి వాళ్ళింటికెళ్ళింది. శైలజ సహాయంతో ఒక గది అద్దెకు తీసుకుంది. పదిమంది పిల్లలకు ట్యూషన్లు చెబుతూ జీవితంలో నూతనాధ్యాయానికి నాంది పలికింది.

డైవోర్స్ వచ్చేశాయి. శ్రీనాథ్‌కి ఏదో శిక్ష కూడా పడింది. రాములమ్మలా చావలేదు. 'జీవితం జీవించడానికే! చావడం పిరికి లక్షణం' అంటూ అందరికీ చాటి చెబుతోందిప్పుడు మాళవిక. శ్రీనాథ్ అంచనా ప్రకారం, చావలేక, పుట్టింటికి పోలేక, పడుండలేదు. ఆడదీ ఒక మనిషేననీ, ఆమెకీ ఒక మనసుందనీ, తలుచుకుంటే ఎదురుతిరిగి తనదైన లోకాన్ని తాను సృష్టించుకోగలదనీ, స్వతంత్రంగా బతకగలదనీ నిరూపించింది. 'మాళవికా ప్రైమరీ అండర్ కిండర్ గార్డెన్ స్కూల్', 'మాళవికా హ్యాండీ క్రాఫ్ట్స్', 'మాళవికా హోమ్ ఫర్ ది ఏజ్డ్' కి మాళవిక అధిపతి! ఎందరికో ఉద్యోగాలిస్తోంది. ఎవరికో నీడ కల్పిస్తోంది! ఆడదంటే చులకనగా మాట్లాడే ప్రతీవాళ్ళకీ, ఒక చురక, మాళవిక!

* * *